కాగితపు పూలు

తోటలో ఒక ఏడాది బిడ్డను ఎత్తుకొని, అటూఇటూ తిప్పుతూ, నడుమ నడుమ గేటు దగ్గరకు వచ్చి చూస్తున్నది అచ్చమ్మ. కడుపునిండా అన్నము తిన్నా కంటి నిండా నిద్రపోయినా, కడుపులో బాధ పోవటములేదు. ఏమిటో అర్థముగాని బాధ, ఆవేదనా మనసులో.

తనను ఎంతో ప్రేమించిన యువకుని కూడా, ఆ మొలక కోసం, వదులు కుంది! తన నెంత ప్రేమించినా- సౌఖ్యమే కాని. సుఖము యొక్క ఫలితము వద్దని తోసిపారేస్తే ఏ మాతృ హృదయము భరించగలదు?

బిడ్డ పుట్టక ముందే తానెన్నో సుఖస్వప్నాలను కన్నది. అట్లాంటిది కనం గానే, బిడ్డను—తన బంగారు తండ్రిని—మాయం చేశారు డబ్బు కక్కుర్తికి నర్సులు! ఎంతకైనా తెగిస్తారు!

నవమాసాలు మోసి కన్న పసిబిడ్డ కోసం పరితపించే హృదయాన్ని ఒక చేత్తో పట్టుకుని, పరాయిబిడ్డల సంరక్షణతో కొంతవరకు తృప్తిని కలిగించుకుంటు న్నది అచ్చమ్మ.

అయినా కడుపులోంచి వచ్చే ఆ బాధ, అర్థము కాని ఆవేదన పట్టలేదు హృదయాన్ని!

"అమ్మా, ఏమైనా తెలిసిందా బిడ్డ విషయమై? కొంతవరకైనా భోగట్టా చేయగలిగారా? మీ కడుపున పదిమంది కొడుకులు పుట్టాలమ్మా! మీ ఋణము ఏ విధముగా తీరుస్తానో" అని ఆత్రముతో పలుకరించింది, అప్పుడే కారు దిగిన శాంతను.

"తెలిసింది. అతి కష్టముమీద నీ బిడ్డ ఆచూకీ తెలిసింది. ఎక్కడుండేది కూడా చెప్పారు నర్సులు" అని కొంచెము సందేహంతో, పెదవి విరుస్తూ చెప్పింది శాంత.

“చెప్పండి. నా బిడ్డ ఎక్కడున్నాడో? నా తండ్రికోసం నా హృదయము కొట్టుకొంటోంది. చెప్పరూ? ఈ ఊళ్లోనే ఉన్నాడా? నా దేహంలోని ప్రతి నరమూ వాడికోసం పరితపించి పోతున్నది.”

“.... ....”

“చెప్పండి, ఆలస్యమెందుకు? నా కొడుకు- నా ప్రేమనిధి- నా నోముల పంట- నన్ను సుఖసాగరంలో ముంచితేలుస్తాడని స్వప్నాలను కంటున్నాను; మనోవీధిలో మేడలు కట్టున్నాను. నా బంగారు నాయన ఎక్కడున్నాడో చెప్పి, పుణ్యం కట్టుకోండి.”

“అచ్చమ్మ! నీ కొడుకు....నీవు ఎత్తుకున్నవాడే! నా కొడుకని భయంతో, జాగ్రత్తగా, మాతృదేవతకంటె అధికంగా సంరక్షణ చేస్తున్నావే, వాడే నీకొడుకు; ముద్దుల జగదీశు నీ కొడుకే!” దడదడ కొట్టుకుంటున్న హృదయాన్ని ఒకచేత్తో అదుముకుంటూ, ఆయాసంతో, చెప్పలేకచెప్పలేక చెప్పింది.

“ఓసి రాక్షసీ, నానోట మట్టి కొట్టి, నాకన్ను మూసి నర్సులకు లంచమిచ్చి, నా బంగారు నాయనను దొంగిలించావా? ఏడాదినుంచి నా కడుపున చిచ్చుపెట్టిన మహాయిల్లాలవు నీవేనా? నీది మానవ జన్మమేనా?”

అచ్చమ్మ ఆవేశంతో నేలమీద విరుచుకుని పడిపోయింది. శాంత గజగజ వణికిపోయింది. భయంతో నాడులూ, నరాలూ క్రుంగిపోయినాయి. ఈ గడబిడలో ఆఫీసుకు వెళ్లిన రామమోహను రాడుకదా! అతడు వింటే కొంప మునిగిపోతుంది! తన జీవితంలో జరిగిన భయంకరమైన ఘట్టము ఒక్కసారిగా స్మృతికి తెచ్చుకుంది.

* * * *

కొత్తగా పెండ్లి చేసుకొన్న శాంతారామమోహనులు మూడునిద్రల సౌఖ్యము అనుభవిస్తున్నారు. బొంబాయికి తీసుకొనివెళ్లి వింతలూ, విశేషాలూ చూపిస్తున్నాడు. శాంతకు పెండ్లికొడుకు.

ఒకరోజు రాత్రి వెన్నెల్లో కూర్చుని___

“శాంతా, మన ఇద్దరి ప్రేమ శాశ్వతంగా ఉండేటందుకు ఒక కొడుకు పుట్టితే నా ధనమూ, నా కోరికలూ, నా ప్రేమా చరితార్థమవుతాయి. నా ప్రార్థన

లన్నీ ఫలిస్తాయి. నా యిష్టదేవతలు నాకు ఒక కొడుకును ప్రసాదించితే నా పితృదేవతలంతా ధన్యులవుతారు ''

ఆ సందర్భంలో, పితృదేవతల తృప్తికోసం పిల్లల్ని కోరే రామమోహను మాటలు విని అరుచి అనిపించి, "ఇప్పటినుంచి పిల్లలయితే మన స్వేచ్ఛకు భంగం కాదూ ?" అని మాత్రము అనగలిగింది శాంత.

సమయానికి ఆ మాట అన్నా రామమోహను మనస్సు గ్రహించినట్లే కన బడుతుంది శాంత. తనకొక కొడుకు పుట్టితే అమితంగా ప్రేమిస్తాడేమో తన పెని మిటి ! ఎప్పుడూ తోచదనుకుంటూ ఇటూ అటూ తిరుగుతూ ఉంటాడు. తన పెని మిటి ఛాయ—భర్తయొక్క ప్రేమ శాశ్వతంగా నిలిచే చిహ్నము—ఇద్దరి ప్రణయపు రాశి—నిజంగా పుట్టితే ఎంత ప్రేమిస్తాడో భర్త తనను ? అతనికి తెలియకుండా ఒక నిట్టూర్పు విడిచింది శాంత.

* * * * *

ఆ రోజు సాయంకాలము రామమోహను ఆఫీసునుంచి తొందరగా ఇంటికి వచ్చాడు. భార్యాభర్తలు కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ టీ త్రాగుతున్నారు.

నగముపూరీ నోట్లో పెట్టుకొని తింటూ, "ఇవాళ ఒక సంతోషకరమైన వార్త తెలిసింది, శాంతా ! నీకు ఆ సంగతి చెప్పాలని ఎంత జోరుగా కారు నడిపాననుకున్నావు ! కరాచీలో మా కంపెనీ బ్రాంచి ఒకటి ఉన్నది. అక్కడ దాన్ని వాళ్లు సరియైన పద్ధతులలో నడపకపోవటమువల్ల నష్టమువచ్చింది. అందునుంచి నన్ను అక్కడ కొంతకాలము పనిచేయమన్నారు. అంటే, ఏడాదికి తక్కువ కాకుండా. నీవు కరాచీ చూడలేదు కదూ ? నా స్నేహితులు చాలామంది నిన్ను తీసుకొని రమ్మని వ్రాస్తున్నారు ఇదివరకే. రెండూ కలిశాయి. ఒక వారంలోపల మనము వెళ్లాలి." బుజాలు ఎగురవేస్తూ చెప్పాడు.

"నేనా ? ఈసమయములో మీతోకూడా వస్తే, మీరు ఆఫీసుపని ఏం చేయగలుగుతారు ? నాకు సేవచేయటమే సరిపోతుంది ఇంకా కొన్నాళ్లపాటు ఒంటరిగా మీరు—"

"ఏం ? నాతో కరాచీకి రావటాని కేం అభ్యంతరం ? ఈ అవకాశము నేను ఎన్నోదినాలనుంచి ఎదురుచూస్తున్నా. ఏందుకురావు ?"

కెంపెక్కిన చెంపలతో, సిగ్గుతో ఒకసారి కళ్లెత్తి మళ్లీ వాల్చింది శాంత, పెదవి కొరుక్కుంటూ మాట పెకలనివ్వక చిరునవ్వు నవ్వింది.

"నాతో చెప్పలేదేమి యిన్నాళ్లు" అంటూ ప్రణయ సముద్రములో ముంచి యెత్తాడు.

మాటమాత్రానికే అతనికి కలిగిన సంభ్రమమూ, తృప్తీ శాంతను ఉక్కిరి బిక్కిరి చేశాయి.

*   *   *   *   *

రామమోహానుకు ప్రతిరోజూ గంటలకొద్దీ కూర్చుని జాబులు వ్రాసేది శాంత. ఒక ఉత్తరం వ్రాయాలంటే ఎన్నో కాగితాలు వ్రాసి చింపేది. ఎన్ని వ్రాసినా తృప్తిలేక ఒక్కసారి ఫోనులో మాట్లాడేది.

అతడు కరాచీకి వెళ్ళిన ఆరు నెలలకు మగబిడ్డ పుట్టాడనీ, మాతాశిశువులు క్షేమంగా ఉన్నారని జాబు వెళ్ళింది.

ఇంక నిలువలేకపోయాడు. స్నేహితులందరికీ పార్టీ యిచ్చాడు.

"ఎప్పుడొచ్చి ఆ కొడుకును చూద్దునా" అనే ఉత్సాహం ఉద్రేకం కెరటం వేస్తూ ఉండేది మనసులో? పాపం ఆ ఉద్యోగానికి సెలవన్నా దొరకదు.

ఏం చేస్తున్నాడు, ఎట్లా ఉన్నాడు అన్న జాబులకు విధీ విరామమూ లేదు.

ఎన్నో దినాల నుంచి ఎదురు చూసిన రోజు వచ్చింది. తన ప్రణయ నిధిని చూపిద్దామని తాపత్రయపడుతున్న సమయం వచ్చింది శాంతకు. ఆ సాయంకాలము రామమోహాను వస్తాడు. ఆ రోజల్లా తీరికేలేదు ఆమెకు. పిల్లవాడి మీద ముద్దుల వర్షము కురిపిస్తూ పాటలు పాడుకుంటూ గృహాన్ని కొత్త పద్ధతిలో అలంకరించింది ఆనందోత్సాహాలను పట్టలేకుండా ఉంది.

కొడుకుతో సహా స్టేషనుకు వెళ్ళి భర్తకు స్వాగతమిచ్చింది.

ఆనందబాష్పాలు తుడుచుకుంటూ కొడుకును ఎత్తుకుని ముద్దులాడాడు.

వాళ్ళిద్దరిని విడిచి ఒక్క క్షణమైనా ఉండలేదు.

* * * *

భర్త కొడుకును ముద్దుపెట్టుకొనేటప్పుడు శాంత మనస్సంతా కలవరపడేది. వస్తూన్న కళ్ళనీళ్ళను అతి కష్టముతో ఆపుకొని ముఖము అవతలకు త్రిప్పుకొనేది ఒకసారి రామమోహను కంటపడ్డవా దృశ్యము.

"కళ్ళ నీళ్ళెందుకు శాంతా? ఎంత ఆనందం అనుభవిస్తున్నావు? నీకేదయినా లోపమయితే నాకు చెప్పు" అని బుజ్జగించి అడిగాడు.

"ఈ సంతోషము—సుఖము—శాశ్వతమనుకున్నారా? భగవంతుడు అంత రాయము కల్పిస్తాడేమో! అంతవరకు ధన్యులమే" అంటూ కళ్ళు ఒత్తుకున్నది.

పైకి ఆ మాట అన్నా, అంతరాత్మ అహోరాత్రాలూ పీడిస్తూనే ఉండేది. తాను చేసిన ద్రోహము! తన పెనిమిటికి తాను కృత్రిమ సౌఖ్యము ఒక ద్రోహము వల్ల కల్పించింది! నిజంగా తనకే ఆ కొడుకు పుట్టినట్లయితే తనకెంత సంతోషంగా ఉండేదో?

కాని పాపం, ఆ తల్లి, ఆసుపత్రిలో పిల్లవాడిని కనపడకుండా చేస్తే, ఎంత తపించిందో?

కృత్రిమమైన తన మాతృ హృదయానికే ఒక క్షణము పిల్లవాడు కనబడక పోతే తోచదే? ఆ తల్లికో?

ఈ విధంగా పరుగులెత్తుతూ పరితపించే హృదయాన్ని పోగు చేసుకుంటూ తన జీవితంలోని గంభీరమైన రహస్యాన్ని భర్తకు తెలియకుండా కాలము గడుపు తున్నది శాంత.

* * * *

జగదీశు సంరక్షణ కోసం నియమింపబడ్డ అచ్చమ్మ, తనకు ఏడాది క్రింద ఆసుపత్రిలో పుట్టిన బిడ్డను నర్సులు మాయం చేసిన విషయమై భోగట్టా చేసే షరతు మీద, పనికి కుదిరింది.

సంగతి సందర్భమంతా తెలిసిన తరువాత పై ప్రాణాలు పైన ఎగిరిపోయి నాయి శాంతకు.

ఏం చేస్తుందో అచ్చమ్మ. ఆవేదన అనుభవించే మాతృ హృదయము ఎంతకైనా తెగిస్తుంది. అల్లరి చేసి పోలీసుల దాకా వెడితే కొంపలంటుకుపోతాయి అన్నిటికంటె ముందు రామమోహనుకు తెలిస్తే ఇంకేమయినా ఉందా?

రామమోహనుకు నిజం తెలిసిందంటే—ఎవరిని తాను తన రక్తపుముద్ద అని ప్రేమిస్తున్నాడో, ఆ వంశవర్ధనుడు తన బిడ్డడు కాడని తెలిసిందంటే భరించ గలడా?

తన కష్టసుఖాలు పంచుకుంటూ-తనకు వంశవర్ధనుణ్ణి ప్రసాదించింది శాంత అని మురుస్తున్న రామమోహనుకు, శాంత-పట్టి బూటకంతో-హృదయాన్ని కలచి వేసే నాటకానికి సూత్రధారిణి అయిందని తెలిసిందంటే, ఆమెకు మనిషికి విధించే శిక్ష విధిస్తాడా? కలలో మాట!

పోనీ—తనకు సహజమైన, ప్రకృతి సిద్ధమైన స్త్రీ విధిని పాలించటానికి ఏమైనా అవకాశము ఉందా అంటే, తాను తలక్రిందుగా తపస్సు చేసినా బిడ్డ తల్లి కాలేదని ఎంతమంది డాక్టర్లు చెప్పలేదు?

అచ్చమ్మకు డబ్బు ఆశ పెట్టింది. ఎప్పటికీ తన యింట్లో తన మాదిరిగానే ఉండమంది. ఏది కావాలంటే అది యిస్తానంది, ఆ బిడ్డను తప్ప.

ఆ బిడ్డ వచ్చిన తరువాత తననెంతో ప్రేమిస్తున్నాడు తన పెనిమిటి. అన్ని ఆశలు—అన్ని కోరికలు అడుగంటిపోవలిసినదేనా ఆ దంపతులకు?

శాంత అచ్చమ్మను పిచ్చి ఆసుపత్రిలో చేర్పించింది. అచ్చమ్మ మళ్ళీ మామూలు స్థితికి రాజాలదని డాక్టర్లంతా చెప్పారు.

'జగదీశు నా కొడుకు, నీవు దొంగవు-రాక్షసివి' అని కనబడ్డ వాళ్ళందర్నీ తిట్టూనే ఉంటుంది అచ్చమ్మ.

రోజూ సాయంకాలము అచ్చమ్మను చూచి వచ్చిన తరువాత కడివెడు నీళ్ళకు ఏడుస్తుంది శాంత, తాను తన పెనిమిటి అమూల్యమైన ప్రేమను కాంక్షించి నంతవరకూ అచ్చమ్మ ఆవిధంగా ఉండవలసిందే కదూ!